

# వైకుంఠయాత్ర

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**మెయిన్ రోడ్డు** ఎక్కిన తరువాత శివాజీకి ఎటువైపు వెళితే హైద్రాబాద్ వస్తుందో, ఎటువైపు వెళితే నాగార్జున సాగర్ వస్తుందో తెలియలేదు.

కుడివైపు తిప్పాడు. రోడ్డుకి అటూ ఇటూ చూశాడు. కొద్ది దూరం వెళ్ళిన తరువాత కనపడిన మైలురాయిని బట్టి హైదరాబాద్ ముప్పై ఏడుకిలోమీటర్ల దూరంలో వుందని, తాను వెళ్ళేది సరైన దారేనని అనుకున్నాడు.

అతని బ్రెయిన్ అంతా ఎగ్జయిటింగ్‌గా ఉంది. రెండోసారి చావుకి అతి దగ్గరగా వచ్చి మళ్ళీ తప్పించుకున్నాడు. ఊపిరి అందక తాను పడిన అవస్థ గుర్తొస్తే భయం వేసింది అతనికి. ఆ దూలానికి చెదపట్టకపోయి వుంటే తాను ఈ పాటికి మృత్యుగృహంలో వుండేవాడు.

ఎవరు చెప్పారు చెద మనిషికి హాని చేస్తుందని? తనకి మేలు చేసింది, తన ప్రాణాన్ని కాపాడింది చెద పురుగు.

ఆనందంతో గట్టిగా అరిచి వేగం పెంచాడు శివాజీ. సిటీలోకి ప్రవేశించాక తాను వెళ్ళాల్సిన చోటికి దారి అడుగుతూ పోనిచ్చాడు వ్యాన్‌ని.

మరోసారి చేతిగడియారం వైపు చూసుకున్నాడు చలపతి. తొమ్మిది దాటి పది నిమిషాలయింది.

"శివాజీ ఇల్లు వదిలి సరిగ్గా పన్నెండు గంటలు దాటింది."

"అవును. ఏదో జరిగి వుంటుంది అతనికి" కొద్దిగా జాలిగా, కొద్దిగా సంతోషంగా చెప్పింది ఆదిలక్ష్మమ్మ.

"పోలీసులకి రిపోర్టు ఇవ్వాలిగా మరి?" అడిగాడు పవన్. అతను ఇంకా ఇంట్లో రహస్యంగా గడుపుతున్నాడే తప్ప ఇల్లు వదిలి బయటికి వెళ్ళడంలేదు.

"అప్పుడేకాదు. ఇంకాసేపు చూద్దాం. ఇంత వెంటనే కుమారస్వామి మళ్ళీ ఇంకొక ప్రయత్నం చేస్తాడని నేను అనుకోను" చెప్పాడు చలపతి.

"వాడు పరమ రాక్షసుడు. అవకాశం వస్తే వదలడు" కుమారస్వామి పొలిటికల్ కెరీర్‌లో నెగిటివ్ ఏస్పెక్ట్ తెలిసిన ఆదిలక్ష్మమ్మ చెప్పింది.

"అవకాశం ఇచ్చాం. దాన్ని ఉపయోగించుకున్నాడో లేదో వేచి చూద్దాం" చెప్పాడు చలపతి.

మరో పావుగంట గడిచిన తర్వాత ఆ ముగ్గురికీ అసహనం, ఆందోళన పెరగసాగాయి.

బొంబాయిలోని పావని స్టార్ మూవీస్‌లో వచ్చే 'ది ప్రిన్స్ అండ్ ది పాపర్' సినిమా చూస్తోంది ఆ సినిమాకు తాను తన భర్త శేషగిరితో కలిసి చాలా ఏళ్ళ క్రితం చూడటం గుర్తొచ్చింది. ఆ రోజు రాజ్‌కపూర్ కూడా ఆ సినిమాకి వచ్చాడని ప్రేక్షకులు చెప్పుకోవడం కూడా గుర్తొచ్చింది.

శివాజీ పధ్నాలుగవ పుట్టినరోజుకి తను ఆ నవలను ప్రెజెంట్ చేయడం కూడా గుర్తొచ్చింది. చూడటానికి ఒకేలా ఉండే ఇద్దరు టీనేజర్స్‌లో ఒకడు ప్రిన్స్ ఆఫ్ వేల్స్ ఎడ్వర్డ్, ఇంకొకడు బీదవాడికి పుట్టిన సామాన్య ప్రజలతో కలిసి జీవించడంతో వారి గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

ఆవిడకి అకస్మాత్తుగా తన కొడుకుతో మాట్లాడాలని అనిపించింది. హైదరాబాద్‌లోని పవన్ ఇంటి నంబరు రాసుకున్న చిన్న పుస్తకం తీసుకుని, చెప్పులు తొడుక్కుని టీవీ ఆపివేసి దగ్గరలో ఉన్న ఎస్.టి.డి బూత్‌కి వెళ్ళింది.

పావుగంటలో ఆవిడకి హైదరాబాద్ నంబరు దొరికింది.

"హలో" వినిపించింది ఆదిలక్ష్మమ్మ గొంతు

ఆదిలక్ష్మమ్మ గొంతు తన భర్త మొదటి భార్య గొంతు వినడం మాట్లాడటం కూడా అదే మొదటిసారి.

"హలో! ఎవరది?"

రిసీవరు పెట్టేయ్యాలనుకున్నది కాని, అడిగింది – "శివాజీతో మాట్లాడాలి."

"శివాజీతోనా? ఎవరు మీరు?"

"బొంబాయి నుంచి పావనిని."

పావని.

క్షణకాలం ఆదిలక్ష్మమ్మకి అనిపించింది వెంటనే రిసీవరు క్రెడిల్ మీద వుంచాలని. కాని ఆవిడ ఆ పని చేయలేదు.

"లేదు. బయట ఊరు చూడటానికి వెళ్ళాడు. ఇంకాసేపట్లో రావచ్చు."

"వస్తే నేను ఫోను చేశానని చెప్పండి."

"అలాగే. మీకు ఫోను చేయమని చెప్తాను."

"మా ఇంట్లో ఫోను లేదు. ఎప్పుడు బయలుదేరతాడట?"

"ఇంకొక నాలుగైదు రోజుల్లో."

"మీరు కులాసానా అక్కా?" మర్యాదగా అడిగింది పావని అదే మొదటిసారి మాట్లాడటం కాబట్టి."

"కులాసా. నువ్వు?"

"క్షేమమే. బొంబాయి వచ్చినప్పుడు మా ఇంటికి తప్పకుండా రండి."

"అలాగే. నువ్వు హైదరాబాద్ రావాల్సింది."

"అదే అనిపిస్తోంది ఇప్పుడు. వాడిని వదిలి వున్నది లేదు నేను."

ఆదిలక్ష్మమ్మ గిల్టీగా ఫీలైంది ఆ మాటలు వినగానే. మాతృ ప్రేమతో తల్లి తన కొడుకుతో మాట్లాడాలని ఫోను చేస్తే ఆ కొడుకుని మృత్యువుకి అప్పగించడానికి పంపించింది.

"నాకు నీ మీద కోపంలేదు" చెప్పింది ఆదిలక్ష్మమ్మ పావనిని సంతోషపెట్టాలని.

"నాకు అనిపిస్తోంది వాడు పుట్టకుండా నేను వారితోపాటు పోయి వుంటే బాగుండేదని. మీ సంగతి నాకు కడుపులో పడ్డాక కాని చెప్పలేదు ఆయన. ఆయన్ని తప్పు పట్టను."

ఇద్దరి మధ్య కొన్ని క్షణాలు గంభీరమైన నిశ్శబ్దం. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు వున్నారు.

"ఒక్కటే బాధ అక్కా! తండ్రి ప్రేమ శివాజీ ఎరగడు. కనీసం సోదర ప్రేమ అయినా ఎంజాయ్ చేస్తాడని అక్కడికి పంపించాను."

ఆదిలక్ష్మమ్మ ఇంకాస్త గిల్టీగా ఫీలైంది ఆ మాటలు వినగానే.

"మీరు తప్ప వాడికి నావాళ్ళంటూ లేరు. మా పుట్టింటివైపు వాళ్ళకి ఎన్నో ఏళ్ళ క్రితమే నేను దూరమయ్యాను. వాడికి మిగిలింది తండ్రివైపు వాళ్ళే" బాధగా చెప్పింది పావని.

"శివాజీని నా కొడుకులా చూసుకుంటున్నాను" ఎంతో అవస్థపడి అబద్దం చెప్పింది ఆదిలక్ష్మమ్మ. అది వాస్తవం కాదు కాబట్టి ఆ అవస్థ.

"నాకు తెలుసు అక్కా! ఎంత చెడ్డా వాడిది మీ ఆయన రక్తమేగా. వాడిని మీ కొడుకుని ప్రేమించినట్లు ప్రేమించడం సహజం."

ఆది లక్ష్మమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గొంతులో ఏదో అడ్డుపడ్డట్టయింది ఆవిడకి.

"నాకు పవన్‌ని చూడాలని వుంది. ఇద్దరికీ బాగా పోలికలు వున్నాయని విన్నాను. వీలు చూసుకుని మీరంతా ఒకసారి వచ్చి వెళ్ళొచ్చుగా? శివాజీకి, పవన్‌కి నెలలే తేడా."

ఇంకా కొన్ని క్షణాలు ఆగితే ఆదిలక్ష్మమ్మ ఏడుపు పావనికి వినిపించి వుండేది. కాని "రేపు మళ్ళీ ఫోను చేస్తాను" అని చెప్పి పావని రిసీవరు పెట్టేసింది.

ఆదిలక్ష్మమ్మకి చాలా కాలంగా తాను చెప్పాలనుకుంటున్న విషయాలు చెప్పాక పావనికి మనసు తేలికపడినట్టయింది. ఎస్.టి.డి బిల్లు చెల్లించి ఇంటికి చేరుకుంది.

ఆదిలక్ష్మమ్మ రిసీవరు పెట్టేసి కళ్ళు తుడుచుకున్నాక తనవైపు అంతసేపూ ప్రశ్నార్ధకంగా చూస్తున్న చలపతితో చెప్పింది.

"పావనమ్మ బొంబాయి నుంచి కొడుకుతో మాట్లాడాలని."

"అది అర్థమైంది కాని, ఎందుకింత బాధపడుతున్నావు?"

"చెప్పినా అర్థంకాదులే" అని లోపలికి వెళ్ళిపోయింది ఆదిలక్ష్మమ్మ.

పావని మాటలు ఆవిడ మనసుకి సూటిగా తాకాయి.

'ఎంత చెడ్డా వాడిది ఆయన రక్తమేగా. వాడిని మీ కొడుకుని ప్రేమించినట్లుగా ప్రేమించడం సహజం.'

ఆదిలక్ష్మమ్మకి తన భర్త గుర్తుకువచ్చాడు. బతికి ఉంటే జరుగుతున్నదానికి ఆయన అంగీకారం ఖచ్చితంగా వుండేది కాదు. ఆయనకి ఒక విధంగా తాను ద్రోహం చేస్తున్నట్లే.

ఎంతో కలత చెందింది ఆవిడ మనసు. అది గుర్తించిన చలపతి, పవన్ ఆవిడ తన గదిలోకి మౌనంగా వెళ్ళినా వారించలేదు. ఆవిడ పిల్లో కొద్దిసేపు తడిసింది.

మందుకొడుతూ టి.వి చూడటం కుమారస్వామికి ఇష్టమైన పనుల్లో ఒకటి. ఆ సమయంలో అతను స్టార్ మూవీస్‌లో వస్తున్న 'ది ప్రిన్స్ అండ్ ది పాపర్' సినిమా చూస్తున్నాడు.

బీదరికంలో పుట్టి పెరిగిన టాం యువరాజుగా అతిథుల ముందు భోజనానికి కూర్చున్నాడు. సర్వెంట్ తెల్ల నేప్‌కిన్‌ని అతని ఛాతీకి అమరిస్తే శుభ్రంగా ఉన్న అది మురికి అవుతుందని తీసేస్తాడు. అతిథులంతా యువరాజు చర్యని చూసి తామూ తీసేస్తారు. యువరాజు చేత్తో తింటే, అతిథులు కూడా అనాగరికంగా భావించే ఆ పద్దతిలోనే చేత్తో తింటారు.

చివర్లో ఫింగర్ బౌల్స్‌లో చేయి కడుక్కోడానికి నీళ్ళు తెస్తే, దాని ఉపయోగం తెలియక ఎడ్వర్డ్ స్థానంలో యువరాజుగా ఉన్న టాం ఆ బౌల్ ఎత్తి నీరు తాగితే, మిగిలిన వాళ్ళూ యిష్టంగానే ఆ పని చేస్తారు.

సరిగ్గా ఆ సమయంలో అనారోగ్యంగా ఉన్న ఎడ్వ అర్డ్ తండ్రి బ్రిటీష్ కింగ్, హెన్రీ ఫిఫ్త్ మరణించాడన్న వార్త తెస్తాడు వార్తాహరుడు.

'కింగ్ డెడ్. లాంగ్ లివ్ ది కింగ్' అనగానే టాం సింహాసనంలో నుంచి లేవబోతే వారిస్తారు.

"నేను ఇప్పుడు కింగ్‌నా?" అడుగుతాడు టాం.

"అవును."

"నేను ఏది చెపితే అదీ జరుగుతుందా?" అడుగుతాడు టాం అమాయకంగా.

"యువర్ వర్డ్ ఈజ్ ఏ కమాండ్."

"దేముడితో చెప్పి కింగ్ ప్రాణాలు తీసుకురండి."

టెలిఫోను మోగింది రిసీవరు ఎత్తి అవతలివైపు నుంచి రాములు చెప్పేది విని లేచి నిలబడి అరిచాడు కోపంగా.

"డామిట్! బుర్ర, బుద్ది వుండక్కర్లా? మిమ్మల్ని నరికి పోగులు పెడతాను."

"అది కాదు సార్.." నమ్రతగా చెప్పాడు రాములు.

అవతలివైపు కుమారస్వామి రిసీవరు పెట్టేయగానే అడిగాడు తాతాచారి భయంగా.

"అగ్గిమీద గుగ్గిలం అయ్యాడా?"

"కాదు మరీ?"

కుమారస్వామి రాగానే ఆ టూల్స్ షెడ్‌లోకి వెళ్ళి విరిగిన దూలాన్ని, ఆ దూలానికి పట్టిన చెదను పరిశీలించాక కాని అతని ఆగ్రహం తగ్గలేదు. అందులో ఎవరి తప్పూ లేదని తెలిశాక స్థిమితంగా ఆలోచించసాగాడు.

"వాడిప్పుడు పోలీసులకి రిపోర్ట్ చేస్తే వాళ్ళకు ఇది సాక్ష్యమవుతుంది. మిగిలిన దూలాలు ఎలా వున్నాయో కొట్టి చూడండి"

వాళ్ళు మిగిలిన నాలుగు దూలాలూ కొట్టి చూస్తే, రెండు బాగానే వున్నాయి. ఒకటి సగందాకా పాడయింది.

"వాటిని తీసి దూరంగా పారేయండి. చెద తింటే ఈ దూలాలను ఎప్పుడో తీసేశామని చెప్పాలి పోలీసులకి."

"అలాగే"

"ఇలా తీసేశామన్న గుర్తులు ఎక్కడా కనపడకూడదు అది ముఖ్యం. పెట్రోల్ వాసన పోకపోతే కలరా వుండలు తెచ్చిపోయండి. అప్పుడు ఆ వాసన చస్తుంది."

"అలాగే."

"ఒకళ్ళు ఈ ట్యూబ్‌ని దూరంగా ఎక్కడికయినా తీసుకెళ్ళి వెంటనే తగలేయండి. ఎంత పెట్రోల్ వృధా అయింది? అది వాడిమీద కుమ్మరించి, తగలేసి పాతిపెట్టినా బాగుండేది."

అరగంటలో కుమారస్వామి చెప్పిన పనులన్నీ పూర్తిచేశారు ముగ్గురూ. అతను ఆ షెడ్‌ని పరిశీలనగా చూసి తృప్తిపడ్డాడు.

ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేస్తే సి.ఐ స్టేషన్‌లో లేడు. అతని ఇంటికి ఫోన్ చేసి "ఇవాళ మధ్యాహ్నం మా మారుతి వ్యాను ఒకటిపోయింది. రిపోర్టు అప్పుడు ఇచ్చినట్లుగా రాసుకో" అని వ్యాను నంబరు, ఆ వ్యాను ఎక్కడ పోయింది చెప్పాడు కుమారస్వామి.

ఆ వివరాలు రాసుకున్న తరువాత అడిగాడు అవతలినుంచి సి.ఐ.

"ఎటువంటి నేరంలో ఇన్‌వాల్వ్ అయింది ఈ వ్యాన్?"

"దేంట్లోనూ కాలేదు. దాన్ని ఇందాకే ఎవరో ఎత్తుకెళ్ళారు అన్నట్టు నంబరు ప్లేట్ మార్చాక దాని అసలు నంబరు రాసుకో."

రిసీవరు పెట్టేశాక కుమారస్వామి జరిగినదానికి సాక్ష్యాధారాలు ఇంకా ఏమి వున్నాయా అని ఆలోచించాడు.

"మీరు ఈ రాత్రి మీ ఇంట్లో వున్నారు. పోలీసులు వస్తే అలాగే చెప్పండి. మిమ్మల్ని అరెస్ట్ చేస్తే నేను చూసుకుంటా. మీకు మాత్రం పవన్ గురించి ఏమీ తెలియదు. అతన్ని ఈ మధ్యకాలంలో చూడలేదు.సరేనా?"

తలలు ఊపారు అంతా.

"వెళ్ళండి."

28

శివాజీ వ్యానుని ఇంటి ఆవరణలో ఆపి దిగి లోపలికి వచ్చాడు ఆదుర్దాగా వున్న అందరూ అతని వైపు చూశారు.

"ఇంతసేపయిందే?" అడిగాడు చలపతి చాలా మామూలుగా.

"మళ్ళీ ఆ కుమారస్వామి నన్ను చంపే ప్రయత్నం చేశాడు. లక్కీగా బయటపడ్డాను" చెప్పాడు శివాజీ.

శివాజీకి ఆదిలక్ష్మమ్మ మంచినీళ్ళ గ్లాసు యిచ్చింది. ఆ నీళ్ళు తాగి, జరిగింది వివరంగా చెప్పాడతను మొత్తం జాగ్రత్తగా విన్న చలపతి, శివాజీ బరువుకి చెదపట్టిన దూలం విరిగి అతను బయటపడ్డాడన్న మాటకు ఆశ్చర్యపడ్డాడు.

"మొత్తానికి రెండోసారి కూడా అదృష్టదేవత నిన్ను కాపాడిందన్నమాట" అభినందిస్తున్నట్టుగా చెప్పాడు.

"అవును బాబాయ్ ఈ రోజుతో నా ఆయుష్షు పూర్తయిందని ఎంత భయపడ్డానో. నాకు ఇంకా ఈ భూమి మీద నూకలున్నాయి కాబట్టి అలా బయటపడ్డాను" చెప్పాడు శివాజీ.

ఆదిలక్ష్మమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బయటకి వెక్కి వెక్కి ఏడుస్తూ శివాజీని కౌగిలించుకుంది.

"ఎందుకు పెద్దమ్మా అంత ఇదవుతావు? నాకేమీ కాలేదుగా?" ఆవిడని సముదాయిస్తూ చెప్పాడతను.

"అదికాదు నాయనా! చూస్తూ చూస్తూ మేమే నిన్ను మృత్యువుకి బలి చేస్తున్నాం నువ్వూ, పవన్ ఒకేలా వుండబట్టి.."

ఆవిడ నిజం చెప్పబోతోందని గ్రహించిన చలపతి ఆమెకు అడ్డుపడుతూ "వదినా!" అని అరిచాడు పెద్దగా.

ఆవిడ మాట్లాడటం ఆపి చూస్తూంటే "వదినా! మీకు ఇష్టంలేకపోతే శివాజీని మళ్ళీ బొంబాయి పంపిచేద్దాం. ఎందుకు చరిత్ర అంతా చెప్పడం?" గద్దింపుగా అరిచాడు చలపతి.

ఆదిలక్ష్మమ్మ అంతటితో తమాయించుకుని తనను తాను కంట్రోల్ చేసుకుంది.

"ముందు స్నానం చేస్తాను ఒళ్ళంతా చీదరగా వుంది."

శివాజీ బాత్‌రూంలోకి వెళ్ళాక పవన్ బాధగా చెప్పాడు చలపతితో.

"బాబాయ్ నాకు ఇదంతా ఇబ్బందిగా వుంది. అతన్ని బొంబాయికి పంపించేద్దాం."

"నువ్వూ, మీ అమ్మ సెంటిమెంటల్‌గా ఆలోచిస్తే ఎలా? రేపు ముఖ్యమంత్రి పదవిలో వుంటే, దాన్ని కాపాడుకోడానికి ఎన్నో మాటలుపడాలి, ఎన్నో చేతులు చేయాలి. ఒకళ్ళు బాధపడతారని మన పనులు చేయడం మానేస్తే

ఇంతకంటే చింతపండు వ్యాపారం చేయడం మంచిది. ఇక రాజకీయాల్లోకి రావడం దేనికి?" గద్దింపుగా అడిగాడు చలపతి.

"శివాజీ కూడా నా బిడ్డలాంటివాడు" తడి కళ్లతో చూస్తూ చెప్పింది ఆదిలక్ష్మమ్మ.

"లాంటికి, నీ బిడ్డకి తేడా లేదా?"

బాత్‌రూములో దుస్తులు విప్పుతుంటే తలమీద నుంచి ఏదో జారి భుజం మీద పడింది. శివాజీ దాన్ని చేత్తో దులిపాడు. చెద పురుగు అది.

"థాంక్యూ! థాంక్యూ వెరీమచ్" చెప్పాడు శివాజీ దానికి.

శివాజీ స్నానం చేస్తుండగా చలపతి, పవన్ రహస్యంగా చర్చించుకుంటున్నారు జరిగింది పోలీసులకి రిపోర్టు చేయాలా వద్దా అని.

"చేసినా ఉపయోగం వుండకపోవచ్చు. కుమారస్వామి ఈపాటికి ఎవిడెన్స్‌లన్నీ నాశనం చేయవచ్చు. అసలు ఆ షెడ్ పీకేసినా ఆశ్చర్యం లేదు. మనం కావాలని కక్షగట్టి ఇలా అబద్ధం ఆడామని పోలీసులు అనుకోవచ్చు. లేదా సాక్ష్యం దొరికితే కుమారస్వామిని అరెస్టు చేయవచ్చు" చెప్పాడు పవన్.

"ఎన్నికలముందు అలాంటిది జరగడంవల్ల రేపు కుమారస్వామి పార్టీ గెలవచ్చుననే నమ్మకంవుంటే, అతను పదవిలోకి వచ్చి తీరతాడని తెలుసు కాబట్టి తాత్సారం చేస్తారు పోలీసులు."

"మరి శివాజీ వేసుకొచ్చిన వ్యాను సంగతి? ఈ పాటికి అది పోయిందని పోలీసులకి కుమారస్వామి రిపోర్టిచ్చి వుండవచ్చు కూడా. దాన్ని ఏ టాంక్ బండ్ మీదో వదిలివస్తే?" అడిగాడు.

“తగలబెట్టిద్దాం."

"ఇన్స్యూరెన్స్ నుంచి కుమారస్వామికి సొమ్ము వస్తుంది. మనకి అగ్గిపుల్ల దండగ ఖర్చు."

చివరికి చలపతికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"శత్రుత్వంకంటే సయోధ్య ముఖ్యం."

రిసీవరు అందుకుని కుమారస్వామి ఇంటికి ఫోన్ చేశాడు అతను ఇంట్లో లేడని, గ్రేప్ గార్డెన్‌కి వెళ్ళాడని తెలిసి, ఆ నంబరుకి ఫోను చేశాడు.

పోలీసులు వస్తే వాళ్ళని తానే హేండిల్ చేయాలని అవుట్ హౌస్‌లో ఉన్న కుమారస్వామి రిసీవర్ ఎత్తాడు.

"చలపతిని."

"ఏ చలపతి?"

"పవన్ బాబాయ్‌ని. పవన్ మూడోసారి కూడా తప్పించుకున్నాడు. చూడు కుమారస్వామీ. పవన్‌తో ఇకనయినా వైరం మానుకో. మేమూ నీవు చేసినలాంటి ప్రయత్నమే మొదలుపెడితే నష్టపోయేది నువ్వుకూడా."

"నువ్వు ఏం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావటంలేదు."

"నీ వ్యాను టాంక్ బండ్ మీద వేమన విగ్రహం దగ్గర వదులుతున్నాం. ఎవరినయినా పంపి తెప్పించుకో.మేము నీతో వైరం కోరడం లేదు మిత్రుత్వమే కోరుతున్నాం. అందుకే జరిగింది పోలీసులకి రిపోర్టు యివ్వడంలేదు."

"అంటే?"

"అంటే ఇకనయినా నువ్వు ఆ ప్రయత్నం మానుకోమని రిక్వెస్ట్ చేస్తున్నాం. ఇది భయంతో చేసే రిక్వెస్ట్ కాదు. మంచితనంతో చేసే రిక్వెస్ట్."

"బేరానికి వచ్చావా?" అడిగాడు కుమారస్వామి.

"అవును సంధి గురించి మాట్లాడటానికే ఫోన్ చేశాను" నమ్రతగా చెప్పాడు చలపతి.

"నా బావమరిది రాంగోపాల్ మాటేమిటి?" అడిగాడు కుమారస్వామి కొద్ది క్షణాల తర్వాత. పాము బుసకొట్టినట్లుగా వుంది అతని స్వరం.

"అతణ్ణి ఎవరు చంపారో కనుక్కుని వాళ్ళని ఏమయినా చేసుకో."

"మరి పవన్ ఎన్నికల్లో నిలబడే మాటేమిటి? విత్‌డ్రా చేసుకుంటాడా?"

"ఉహూ అది జరగని పని."

"అయితే ఇది ఆగని పనే. పోలీసులకి రిపోర్టు చేసుకున్నా నాకేం ఫర్వాలేదు" కోపంగా అరిచాడు తాగి ఉన్న కుమారస్వామి.

"తొందరలేదు. ఆలోచించుకో. రంగంలోకి దిగగల సత్తా మాకు కూడా వున్నదని తెలుసుగా అసెంబ్లీలో రోజూ మొహాలు చూసుకునే వాళ్ళం."

"అదే కూడదంటాను. వెళితే అసెంబ్లీకి వెళ్ళాలి. లేదా వాడు వెళతాడు. ఇద్దరిలో ఎవరో ఒక్కరే గెలిచే పని అది."

"అయితే ఇది ఆగని పనే. పోలీసులకి రిపోర్టు చేసుకున్నా నాకేం ఫర్వాలేదు" కోపంగా అరిచాడు తాగి ఉన్న కుమారస్వామి.

"తొందరలేదు ఆలోచించుకో. రంగంలోకి దిగగల సత్తా మాకు కూడా వున్నదని తెలుసుగా. అసెంబ్లీలో రోజూ మొహాలు చూసుకునే వాళ్ళం."

"అదే కూడదంటాను. వెళితే అసెంబ్లీకి నేను వెళ్ళాలి. లేదా వాడు వెళతాడు. ఇద్దరిలో ఎవరో ఒక్కరే గెలిచే పని అది."

"నేను చెప్పాల్సింది చెప్పాను. పవన్ మాట కూడా ఇదే. తర్వాత నీ యిష్టం."

"నాది ఒకటే మాట వినలేదా? నాది తాచుపాము పగ అని అంటుంటారు."

చలపతికి సహనం నశించడంతో రిసీవర్ క్రెడిల్ మీద పెట్టేశాడు.

శివాజీ స్నానం అయ్యాక బాగా తేరుకున్నాడు. అతని మెడ చుట్టూ తాడూ ఒరుసుకున్న గుర్తులు సబ్బుతో రుద్దుకోవడంతో చాలా భాగం పోయాయి.

అతను వచ్చేదాకా భోజనాల బల్ల దగ్గర అంతా వెయిట్ చేస్తున్నారు. శివాజీ తన కుర్చీలో కూర్చుంటూ చెప్పాడు.

"రేపటినుంచి బయటికి వెళ్ళను."

ఆ రోజు బ్యూటీపార్లర్‌లో వెన్నెలకి హైదరాబాద్ నుంచి ఎస్.టి.డి ఫోన్‌కాల్ వచ్చింది.

"ఇదేమిటి? ఇక్కడికి ఎందుకు చేశారు?" అడిగింది. ఆ మాటలో తను ఫోన్ చేసినందుకు వెన్నెల సంతోషంగానే వుందని గ్రహించాడు శివాజీ.

"ఎక్కువసేపు డిస్టర్బ్ చెయ్యనులే."

"లక్కీగా కస్టమర్స్ ఎవరూ లేరు. ఏ ఐబ్రో ట్వీజింగ్‌కో కస్టమర్ వస్తే నన్ను ఆవిడ పిలిచేదేకాదు. ఏమిటి విశేషాలు?"

"మళ్ళీ నామీద హత్యాప్రయత్నం జరిగింది."

"గాడ్! ఎప్పుడు? ఎలా?" అడిగింది వెన్నెల ఆందోళనగా.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి
www.anandbooks.com
www.telugubooks.in